# సెకండ్ హ్యాండ్

శారద ఏడో తరగతి ఫెయిలయింది!! ఆ రోజు పొద్దున హైస్కూలు నోటీసు బోర్డులో ఏడో తరగతి పరీక్షా ఫలితాల లిస్టు పెట్టారు. మొత్తం నూటపాతికమంది పిల్లలు పరీక్ష రాస్తే అందులో పదిహేనుమంది ఫెయిలయ్యారు.

ఆ పదిహేనుమంది పిల్లల పేర్లు వరుసగా రాసి, నోటీసుబోర్డుమీద అతికించారు. అందులో మొట్టమొదటి పేరే శారదది!

ఫెయిలైనవాళ్ళ పేర్లలో తన పేరుండటం చూసుకున్న శారదకి ఏడుపొచ్చింది.

లిస్టు చూసేందుకు ఆమెతోపాటే స్కూలుకి వెళ్ళిన సుబ్బలక్ష్మికి మాత్రం పట్టరానంత సంతోషం కలిగింది. పైకి ఊరడిస్తూ మాట్లాడినా, ఆమె ఫెయిలైనందుకు మనసులో ఎంతో సంబరపడింది. తన పూజ ఫలించిందని మురిసిపోయింది.

అసలు ఏడో తరగతి పరీక్షలు ప్రారంభమైన రోజు ఉదయాన్నే సుబ్బలక్ష్మి కనక దుర్గ గుడికి వెళ్ళింది. గుళ్ళో ఆ దేవతముందు భక్తిప్రపత్తులతో చేతులు జోడించి దణ్ణం పెట్టుకుంది.

శ్రద్ధగా కళ్ళుమూసుకుని 'శారద ఏడోక్లాసు తప్పితే – తప్పకుండా గుడికొచ్చి మామూలు దణ్ణం పెట్టడంతో సరిపెట్టకుండా సాష్టాంగ నమస్కారం చేసి ఓ కొబ్బరికాయ కూడా కొడతా' నని మొక్కుకుంది!

కొండంత తన కోరికను ఆ అమ్మవారు కేవలం అయిదు రూపాయల కొబ్బరికాయకే తీర్చేస్తుందని తను కలలో కూడా అనుకోలేదు!

శారదా, సుబ్బలక్ష్మి – అక్కాచెల్లెళ్ళు!

అవును! వాళ్ళిద్దరూ ఒకేతల్లి కడుపున పుట్టిన పిల్లలు! ఇద్దరూ ఒక స్కూల్లోనే చదువుతున్నారు!

శారదకీ సుబ్బలక్ష్మికీ వయసులో ఒక్క సంవత్సరమే తేడా. చదువులో కూడా ఒకే తరగతి తేడా! అదే సుబ్బలక్ష్మి పాలిట శాపమైంది.

శారద రెండోతరగతిలోకి వచ్చినప్పుడు సుబ్బలక్ష్మి ఒకటో క్లాసులో చేరింది. తన ఫ్రెండ్సంతా అప్పుడు కొత్త కొత్త పుస్తకాలు కొనుక్కుని హుషారుగా స్కూలు కొచ్చారు. తనూ అందరిలాగా కొత్త పుస్తకాలు కొనుక్కోవాలని కొండంత ఆశపడింది.

"అక్క పుస్తకాలు బాగానే వున్నాయిగా! అవి తీసుకో. మళ్ళీ కొత్తవి కొనాలంటే నాకు తడిసి మోపెడవుతుంది" అన్నాడు తండ్రి.

అప్పుడు తనెంతో మారాంచేసింది. నాన్నకొట్టాడు. అమ్మ దగ్గరకు తీసుకుని ఊరుకోపెట్టింది.

"మనం పేదవాళ్ళం తల్లీ! మీ నాన్నగారికొచ్చే జీతం చాలా తక్కువ! అందులోనే ఇంటి అవసరాలు తీరాలి. నీకూ అక్కయ్యకీ చదువులు చెప్పించాలి. ఇంకా, తమ్ముడికి పాలడబ్బాలు కొనాలి. అందుకే సర్దుకోవాలి తల్లీ... ఎలాగో అలా నువ్వు బాగా చదువుకుంటే పెద్దయ్యాక ఉద్యోగం చేసుకుంటూ అన్నీ కొత్తవే కొనుక్కోవచ్చు" అంటూ నచ్చచెప్పింది.

అందుకే అప్పుడు పరిస్థితులతో రాజీపడింది సుబ్బలక్ష్మి.

అయితే మళ్లీ సంవత్సరం తను రెండో క్లాసులోకి వచ్చినప్పుడు కూడా శారద చదివిన పుస్తకాలే వారసత్వంగా తన చేతికి రావటం ఆమెకు కోపం తెప్పించింది.

"ఇంకెప్పుడూ నాకు 'సెకండ్ హ్యాండ్' పుస్తకాలేనా?" వాటిని విసిరికొడుతూ అడిగింది.

అప్పుడు తన తండ్రి విసురుగా వచ్చి వీపు మీద ఒకటి తగిలించాడు.

"ఏమిటే ఆ పొగరు? పుస్తకాలంటే సరస్వతీ దేవితో సమానం. అలా విసిరికొడితే అక్షరం ముక్క కూడా అంటదు. తెలుసా?-"

"అయినా పుస్తకాలు కొత్తవైనా, పాతవైనా అందులో వుండే పాఠాలొకటేగా? పైగా తన చదువయ్యాక, నీకు ఇవ్వాలి కదాని, అక్కయ్య ఆ పుస్తకాల్ని నలపకుండా ఎంతో జాగ్రత్తగా మెయిన్‌టైన్ చేసింది! తెలుసా?" అన్నాడు.

అంతే! ఇంకెప్పుడూ కొత్తపుస్తకాలు కావాలని సుబ్బలక్ష్మి మారాంచేయలేదు. అయితే ఆ కోరికను మనసులో ఎంతగా అణచుకున్నా తన స్నేహితుల చేతుల్లో అందంగా, పొందికగా మెరిసిపోతూ కనిపించే కొత్తపుస్తకాల్ని చూసినప్పుడు మాత్రం అంతకు రెట్టింపు బలంతో అది ఎగసిపడి బుసలు కొట్టేది. ఆమెను ఉక్రోషానికి గురిచేసేది.

ఓసారి తాను నాలుగో తరగతిలోకి వచ్చే ముందు ఓ రాత్రివేళ ఇంట్లో అందరూ ఆదమరచి నిద్రపోతూండగా - అక్కయ్య స్కూలుబ్యాగ్‌లోంచి రహస్యంగా రెండు పుస్తకాలు తీసి వాటిలోంచి కొన్ని పేజీలు చింపేసింది. అప్పుడైనా తనకు కొత్త పుస్తకాలు కొనిస్తారేమోనన్న చిన్న ఆశ-ఆమెచేత ఆ పిచ్చిపని చేయించింది.

"వీటిలో కొన్ని పాఠాలు లేవు! నాకు కొత్తపుస్తకాలు కొనివ్వండి!" అంటూ ఆ తర్వాత 'డిమాండ్' చేసింది. కానీ ఆ పాచిక కూడా పారలేదు.

చిరిగిపోయిన పేజీల స్థానంలో 'జిరాక్సు' కాపీలు తెచ్చి అతికించిఇచ్చాడు తండ్రి.

ఆ విధంగా ఆశాభంగం కావటంతో, తన అక్కయ్య వరసగా పరీక్షలు పాసవుతూ పైక్లాసులకు వెడుతున్నంతకాలం, వెనకాలే వస్తున్న తనకు కొత్త పుస్తకాల యోగం ఉండదని నిర్ధారణ చేసుకుంది సుబ్బలక్ష్మి.

అలా ఆరేళ్లు గడిచిపోయాయి!

ఇప్పుడు సుబ్బలక్ష్మి ఏడో తరగతిలోకి వస్తోంది. ఇంత వరకూ ఎంత చదివినా, ఎలా చదివినా, ఏం రాసినా స్కూలుకీ పరీక్షలకీ హాజరైతే చాలు – పాసవుతూవచ్చింది. కానీ ఇప్పుడు ఏడోక్లాసులోకి రావటం అంటే – అదో మలుపు... అదో హోదా!

'కనీసం ఈ ఏడోక్లాసులోనైనా తనకు కొత్త పుస్తకాలయోగం పడితే బావుణ్ణు!' అని ఎన్నోసార్లు మనసులో అనుకుందామె. కానీ ఎలా...?

'ఒకవేళ అక్కయ్య ఏడో తరగతి ఫెయిలైతే?'

'అవును! అప్పుడు మళ్ళీ ఆమె ఏడోక్లాసే చదవాలి. అప్పుడు ఆ పుస్తకాల్ని అక్కయ్యే వుంచుకుంటుంది. కాబట్టి తన కోసం తండ్రి అప్పుడైనా కొత్తపుస్తకాలు కొనితీరాలి!'

చీకట్లో చిరుదీపంలా – సుబ్బలక్ష్మి మనసులో చిన్న ఆశ! ఆ ఆశతోనే తను కనకదుర్గకు ఆ విధంగా మొక్కుకుంది. తనపై ఆ తల్లి దయతలచింది... ఆ కోరిక తీర్చింది.

ఇక ఇప్పుడు స్కూలు తెరవగానే తను ఏడో క్లాసులో చేరుతుంది! తన తండ్రి కొత్తపుస్తకాలు కొనిస్తాడు. పెద్ద పెద్ద పుస్తకాలు..చూడముచ్చటగా కనిపించే 'కవర్‌పేజీ'లతో కొత్తపుస్తకాలు! ఆ పుస్తకాలను ఆప్యాయంగా చేతిలోకి తీసుకుని, పేజీలు తెరవగానే అదోరకమైన పరిమళం! ఆ పరిమళమంటే తనకెందుకో చాలా ఇష్టం.

ఆ కొత్త పుస్తకాలకు మంచి మంచి అట్టలు వేసుకుని పైన 'లేబుల్స్' అతికించుకుని వాటిమీద గర్వంగా తన పేరు రాసుకోవచ్చు!

అలా తరుముకొచ్చిన ఆలోచనలు, ఆ రాత్రి సుబ్బలక్ష్మి కంటికి కునుకులేకుండా చేశాయి. మంచంమీద పడుకుని అసహనంగా అటూఇటూ దొర్లుతున్న ఆమెకు అంతలోనే పక్కగదిలోంచి మాటలు వినిపించాయి.

"శారద ఇప్పుడు మళ్ళీ ఏడోక్లాసే చదివితే స్కూల్లో ఫీజులు కట్టాల్సి వుంటుందా?" తల్లి ప్రశ్నిస్తోంది.

"ఏమో? అయినా అది మళ్ళీ అదే క్లాసు చదవటం అనవసరం". తండ్రి సమాధానం.

"అంటే, ఇంట్లో ఖాళీగా కూర్చోపెడదామంటారా?" ఆత్రుతగా అడుగుతోంది తల్లి.

"ఖాళీగా కూర్చోవటమెందుకూ? ప్రయివేటుగా చదివి పదోక్లాసు పరీక్ష రాయచ్చుట!

మా ఆఫీసులో ఆంజనేయులు చెప్పాడు. రెండు మూడేళ్లు ఇంట్లోనే వుండి చదువుకుంటుంది. మహిళామండలికి పంపించి - టైలరింగూ, అల్లికలూ కూడా నేర్పించు. ముందు ముందు ఉపయోగపడతాయి. పద్దెనిమిది రాగానే పెళ్లిచేసేద్దాం!"

తండ్రిమాటలు వింటున్న సుబ్బలక్ష్మి గుండెల్లో రాయిపడింది!

'అక్కయ్య చదువు మానేస్తే - మళ్ళీ ఈ ఏడు కూడా దాని పుస్తకాలే నాకు గతి' అనుకుంది.

ఖచ్చితంగా, అలా ఆమె అనుకున్నట్టే జరిగింది... ఏడో క్లాసులో సైతం ఆమెకు సెకండ్‌హ్యాండ్‌వే అంటగట్టారు.

"ఛీ...ఛీ...దరిద్రం!" అంటూ విసుక్కుంది.

"పోన్లే తల్లీ! బాధపడకు. ఇక ఈ ఒక్క ఏడాదేగా? వచ్చే ఏడు నువ్వు ఎనిమిదిలోకి వస్తావ్. అప్పుడైనా నీకు మీ నాన్న కొత్త బుక్స్ కొనివ్వాలిగా?" అంటూ నచ్చచెప్పింది తల్లి.

తన ఉబలాటాన్ని గుండెల్లోనే మళ్ళీ మూట కట్టి దాచేసుకుంది సుబ్బలక్ష్మి. కష్టపడి చదివి మంచి మార్కులతో ఏడో తరగతి పాసయింది.

ఓ రోజు సాయంకాలం ఆఫీసునించి తిరిగి వస్తూ - సుబ్బలక్ష్మిని పిలిచాడు తండ్రి... వంటింట్లో తల్లికి సాయపడుతున్న సుబ్బలక్ష్మి ఆత్రుత పడుతూ గబగబా వీధిగదిలోకి వచ్చింది.

"ఇవిగోనే, నీ ఎయిత్ క్లాసు పుస్తకాలు!" తన చేతిలో వున్న ప్యాకెట్‌ని ఆమెకు అందించాడు తండ్రి. దానివైపు ఆశ్చర్యంగానూ, ఆత్రుతగానూ చూస్తూ నిలబడింది సుబ్బలక్ష్మి. అదే క్షణంలో వంటింట్లోంచి తల్లికూడా వచ్చింది.

"అమ్మాయికి కొత్తపుస్తకాలు కొనుక్కొచ్చేశారా?" ఆసక్తిగా చూస్తూ అడిగింది.

"వుయార్ లక్కీ లక్ష్మీ! ఈ సంవత్సరం మన సుబ్బికి కొత్త పుస్తకాలు కొనిచ్చే ఖర్చు తప్పింది. సెకండ్ హ్యాండ్ పుస్తకాలు దొరికాయి. బైండ్ చేయిస్తే బ్రహ్మాండంగా వుంటాయి" గర్వంగా చెప్పాడు తండ్రి.

"మొన్న మాటలసందర్భంలో మన సుబ్బ ఏడో తరగతి ప్యాసయిందని మా బాస్‌తో చెప్పాను. ఇవాళ ఆయన సడెన్‌గా ఈ పుస్తకాలన్నీ తెచ్చాడు. వాళ్ళబ్బాయి ఎనిమిది పాసయ్యాట్ట. అయినా మన సుబ్బికి సెకండ్ హ్యాండ్‌వి అచ్చొస్తున్నాయోయ్... శారద ఏడు ఫెయిలయిందా? దాని పుస్తకాలు చదివి, ఇదేమో ఫస్టుక్లాసు మార్కులతో ప్యాసయింది..." అంటూ ఇంకా ఏదో చెప్తున్నాడు తండ్రి.

కానీ ఆ మాటలు సుబ్బలక్ష్మికి వినిపించలేదు. ఆమె కళ్లు మాత్రం నీటిచెలమలయ్యాయి.

★ ★ ★

మరో ఆరేళ్ళ తర్వాత - ఒక రోజు సాయంత్రం -

గదిలో వాతావరణం గంభీరంగా వుంది....

సుబ్బలక్ష్మి చెప్పే సమాధానం కోసం ఎదురు చూస్తున్నాడు తండ్రి. ఆమె మాత్రం తల వంచుకుని కాలి బొటనవేలిని నేలమీద రాస్తోంది.

"మాట్లాడవేమిటే?" కొన్ని క్షణాలు గడిచాక, కుర్చీలోంచి లేచి కూతురు దగ్గరికి చేరుకుంటూ అడిగాడు తండ్రి. అప్పటికీ తలెత్తి తండ్రివైపు చూడలేదు సుబ్బలక్ష్మి.

"ఏం మాట్లాడుతుందండీ? అయినా రెండో పెళ్లివాణ్ని చేసుకోటానికి ఏ కన్నెపిల్ల ఇష్టపడుతుందీ?" భర్తను ఎదురు ప్రశ్నించింది తల్లి.

"రెండో పెళ్ళివాడైనంత మాత్రాన అతనేమీ ముసలివాడూ ముతకవాడూ కాదుగా! అసలు పెళ్లయి ఎంతకాలమైందనీ? మూడేళ్లేగా? చదువు సంధ్యలున్నవాడు... పదివేలకు పైగా జీతం తెచ్చుకుంటున్నాడు. నీక్కూడా తెలుసుగా! అతగాడికి కట్నం ఏభైవేలు ధారబోశాం. మరో పాతికవేలు పెళ్లిఖర్చుల కోసం అప్పుచేశాం. దురదృష్టంకొద్దీ శారద చనిపోయినా తను ఈ ఇంటి అల్లుడుగానే వుండాలని కోరుకుంటున్నట్టు కబురంపాడు! దీన్ని చేసుకునేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని తనకు తానుగా చెప్పాడు! ఇదికాదంటే అతనికి మళ్ళీ కట్నంతో సహా తమ పిల్లనిచ్చి చేయటానికి ఆడపిల్లల తండ్రులు ఎంతోమంది 'క్యూ'లో వున్నారు తెలుసా? ఇప్పుడిది ఔనంటే మనం నయాపైస కట్నం ఇవ్వక్ఖర్లేదు" సుబ్బలక్ష్మికే చెప్తున్న ధోరణిలో భార్యవైపు తిరిగి అన్నాడు తండ్రి.

"మీరు ఎన్నైనాచెప్పండి! నేనైతే ఈ పెళ్లికి చచ్చినా ఒప్పుకోను!" తెగేసిచెప్పింది తల్లి.

తండ్రికి కోపం వచ్చింది.

"నోర్ముయ్! ఆ మాట చెప్పాల్సింది అమ్మాయి. నువ్వుకాదు!" అన్నాడు.

అప్పటివరకూ పెదవి విప్పకుండా ఆలోచిస్తూ నిలబడిన సుబ్బలక్ష్మి - నెమ్మదిగా తల ఎత్తి తండ్రి వైపు చూసింది... కళ్ళల్లో నిలిచిన నీటిని ముని వేళ్ళతో తుడుచుకుంది. మెల్లిగా చెప్పింది -

"నీ ఇష్టప్రకారమే బావను చేసుకుంటాను నాన్నా! అక్కయ్య చదువుకునే రోజుల్లో ఎన్నో ఏళ్ల పాటు, తన పుస్తకాల్ని ఇచ్చేది. తను పోతూ పోతూ బావని కూడా నాకు అలాగే ఇచ్చిందనుకుంటాను. ఆనాడు అక్క పుస్తకాల్ని చదువుకున్నట్టుగా ఇక ముందు అక్కమొగుడితో కాపురం చేస్తాను... అయినా నాకెప్పుడూ 'సెకండ్ హ్యాండ్‌వి' అచ్చొస్తున్నాయని ఓసారెప్పుడో నువ్వే అన్నావుగా! ముహూర్తం పెట్టించు!!"

(స్వాతి మాసపత్రిక - జూన్ 2000)